
సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



హార్సిలీహిల్స్‌పై గ్రామసింహాల స్వైర విహారం

బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తున్నాయి.

- 8లో



బీసీలకు న్యాయం చేయని టీడీపీ

పెరియార్ ఐడీయాలజీ అంటూ పుట్టుకువచ్చిన టీడీపీ బీసీలకు ఎలాంటి న్యాయం చేయకుండా, ఒక కులపార్టీగా నిలిచిపోయిందని బీఎస్పీ కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు అన్నారు.

- 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.440
రెండోరకం	రూ.290	రూ.356

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 110 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

మదనపల్లె సిటీ : స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంచినట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. విద్యార్థులు ఈనెల 23లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థి, తల్లిదండ్రులు ఉమ్మడి చిత్తూరు జిల్లా వారు అయి ఉండాలన్నారు. విద్యార్థులు 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదువుతూ 1.5.2013 నుంచి 31.7.2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. 3,4 తరగతులు చదివిన పాఠశాల, 5వ తరగతి చదువుతున్న పాఠశాల ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల అయి ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన అవసరం



విద్యార్థినులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్ : నులిపురుగుల నిర్మూలనకు ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. మంగళవారం రాయచోటి బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో మధ్యాహ్నం భోజనం అనంతరం విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ – 400 మిల్లీగ్రాముల మాత్రలను పంపిణీ చేశారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్‌బీ ఎస్‌కే) జిల్లా కో–ఆర్డినేటర్ శివప్రతాప్ నాయక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 96.45 శాతం విద్యార్థులకు మాత్రలను అందజేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లత, ఉపాధ్యాయులు, ఎన్‌డీడీ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయికులు

మదనపల్లె సిటీ : రాజంపేటలో జరిగే ఏఐఎస్‌ఎఫ్ ద్వితీయ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవ్, కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్టీయు భవన్‌లో జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. మహాసభలు ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు ఉద్యమ ప్రణాళిక రూపొందించేందుకు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశామన్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కమలాకర్, వినయ్, ఉపాధ్యక్షులుగా నవీన్, చరిత, శ్రీనాథ్, సహాయ కార్యదర్శులుగా చందు, ఇలాహి, భాను, కోశాధికారిగా సాయికిరణ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

విశ్వకర్మను ఆదర్శంగా తీసుకోవాలి

– జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (జగదాంబసెంటర్) : రకరకాల వృత్తులకు ఆద్యుడైన దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని చేతి, కులవృత్తుల వారు తమలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దైవిక వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారాలు, పారిశ్రామిక ప్రాంతాలలో ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ వాళ్ల మాత్రమే కాకుండా వడ్రంగులు, చేతివృత్తుల వారు, హస్తకళాకారులు, మెకానిక్‌లు, స్మిత్‌లు, వెల్డర్లు, పారిశ్రామిక కార్మికులు, మొదలైన వారు విశ్వకర్మను భగవంతుడిగా భావిస్తుంటారన్నారు. అనంతరం వివిధ వృత్తుల వారు జాయింట్ కలెక్టర్‌కు విశ్వకర్మ చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి సందప్ప, హౌసింగ్ పీడీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం దారుణం



టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పీపీఓ విధానం దారుణంగా ఉంది. దీనివల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతోంది. పేద విద్యార్థులు కూడా డాక్టర్లు కావాలన్న లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మెడికల్ సీట్లను ప్రైవేటుపరం చేస్తుండడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వం పేద విద్యార్థులకు అన్యాయం జరిగే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

– ఉద్దె మద్దిలేటి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, కడప



పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు



మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. ప్రభుత్వ కాలేజీల్లో తక్కువ ఫీజుతోనే వైద్య విద్యను పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అదే ప్రైవేటుపరం చేస్తే విద్యార్థులపై ఫీజుల భారం పడుతుంది. తద్వారా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదముంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను త్వరగా పూర్తి చేసి ఎంబీబీఎస్ సీట్లు తెచ్చేలా చొరవ చూపాలి. పేద విద్యార్థులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచించాలి.

– కేసీ బాదుల్లా, రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, కడప

వైఎస్సార్‌సీపీ వ్యూహం..
బలోపేతమే లక్ష్యం!

- పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు ప్రణాళిక
- నేడు రాయచోటిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం ప్రారంభం
- హాజరు కానున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు



సాక్షి రాయచోటి : సమరానికి సన్నద్ధం...సైనికుల్లా కదిలేలా కార్యకర్తలకు దిశా నిర్దేశం.. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ఆందోళనలతోపాటు ప్రజలు, కార్యకర్తలకు నాయకులు అందుబాటులో ఉండేలా చర్యలు.. అనుక్షణం ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పార్టీ నేతలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలకు వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఉపక్రమించింది. అందులో భాగంగా జిల్లా కేంద్రమైన రాయచోటిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఏర్పాటు చేసి కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయనున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి రావడం, ఆ తర్వాత హామీలను అమలు చేయకుండా ముందుకు పోతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు సంస్థాగతంగా కూడా అన్ని విధాలా శ్రేణులను సంసిద్ధం చేసేలా కార్యాచరణ రూపొందించారు.

కొత్త ఉత్సాహం

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల వైఎస్సార్ జిల్లాలో పర్యటించారు. ప్రధానంగా నేతలు, కార్యకర్తలు, శ్రేణుల్లో కూడా మాజీ సీఎం కొత్త ఉత్సాహాన్ని నింపారు. దీనికి తోడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎప్పటికప్పుడు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కలుస్తూ జిల్లా పరిస్థితులను వివరిస్తూ కార్యకర్తల్లో చైతన్యం తీసుకు వస్తున్నారు. అలాగే అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్‌రెడ్డితోపాటు పలువురు నేతలు కలిసి అనేక అంశాలపై చర్చించారు. కార్యకర్తలను ఎప్పటికప్పుడు సమాయత్తం చేస్తూ జనంలో ఉండాలన్న అధినేత ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి శ్రేణులతో మమేకం కానున్నారు.

జిల్లాలో బలంగా వైఎస్సార్‌సీపీ

అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి బలంగా ఉంది. గతంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎంపీ స్థానంతోపాటు మొత్తం ఆరు ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. తర్వాత జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపాలిటీ స్థానాల్లో విజయకేతనం ఎగరవేయడమే కాకుండా అత్యధికంగా సర్పంచ్ స్థానాలను కూడా గెలుచుకుని తిరుగులేని విజయాలు నమోదు చేసింది. ఈసారి వీచిన కూటమి గాలిలోనూ వైఎస్సార్‌సీపీ రాజంపేట, తంబళ్లపల్లె స్థానాల్లో గెలుచుకోవడంతోపాటు రాయచోటి, మదనపల్లెలో గెలుపు అంచుల వరకు వచ్చింది. జిల్లాలో పార్టీకి బలమైన నేతలు, కార్యకర్తలు, అభిమానులు లక్షల సంఖ్యలో ఉన్నారు. రానున్న కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు పార్టీ నేతలు రచిస్తున్నారు.

నేడు పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభం



రాయచోటిలో వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. రాయచోటిలోని బోస్‌నగర్ సమీపంలోని పోస్టాఫీసు వద్ద కార్యాలయాన్ని నిర్మించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, శ్రేణులకు కేంద్ర బిందువుగా కార్యాలయం నిలువనుంది. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయాన్ని బుధవారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రెడ్డెప్పగారి రమేష్‌కుమార్‌రెడ్డిలు పాల్గొని ప్రారంభించనున్నారు.

నేడు ప్రమాణ స్వీకారం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి బుధవారం ఉదయం 9.30 గంటలకు అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరు కానున్నారు.

ఇసుక టోకెన్ల జారీలో చేతివాటం

- రాజంపేట సబ్ కలెక్టరేట్‌లో ఇసుక మాఫియా నీడలు
- అన్యాయాన్ని ప్రశ్నించిన ప్రజలు
- బయటకు పంపిన పోలీసులు



టోకెన్ల జారీలో అన్యాయాన్ని నిలదీసిన వారిని పంపించేస్తున్న పోలీసులు

రాజంపేట : కూచివారిపల్లె సచివాలయం నుంచి రాజంపేట సబ్‌కలెక్టరేట్‌కు ఇసుక బుకింగ్ టోకెన్ల కేంద్రం తరలించినా అక్రమాలు మాత్రం ఆగడం లేదు. బుకింగ్ సెంటర్‌లో పనిచేసే వారు ఇసుక మాఫియాతో చేతులు కలిపి గుట్టుచప్పుడు కాకుండా ఇబ్బడిముబ్బడిగా టోకెన్లు ఇచ్చేస్తున్నారు. ఒక ఐఏఎస్ అధికారిణి సమక్షంలో నడుస్తున్న సబ్‌కలెక్టరేట్‌లోనే ఇసుక టోకెన్ల అక్రమ వ్యవహారం అరికట్టలేని స్థితి నెలకొందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రెవెన్యూ శాఖ పర్యవేక్షణ కొరవడిందన్న అపవాదును మూటగట్టుకుంది. రెండు రోజుల పాటు క్యూ పాటించినా టోకెన్ కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. 3 గంటల్లో స్టాక్ అయిపోతోంది. రోజుకు 1500 టన్నులకే టోకెన్లు ఇస్తున్నారు. ఇదికూడా దొడ్డిదారిలో టోకెన్లు బయటికి వెళ్లిపోతున్నాయి. తెరవెనుక చేతులు కరెన్సీతో తడుస్తున్నాయని ఆరోపణలు వెలువడుతున్నాయి. టోకెన్ల కోసం ఇచ్చిన కొందరి దరఖాస్తులను చెత్తబుట్టలో పడేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

తిరగబడిన జనం..

టోకెన్ల కోసం రోజుల తరబడి తిరుగుతున్న వారు మంగళవారం సాయంత్రం తిరగబడ్డారు. వరుస సంఖ్యలో ఉన్న తమకు టోక్కెన్లు దక్కడంలేదని, ఏదో ఒక కారణంతో కోటా పూర్తయిందని బుకింగ్ సిబ్బంది చెబుతున్నారని ధ్వజమెత్తారు. పేరుకు క్యూలైను అని, ముందుగానే బుకింగ్ సిబ్బంది, ఇసుకాసురులు చేతులు కలిపి టోకెన్లు యథేచ్ఛగా ఇచ్చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక అవసరమై న్యాయబద్ధంగా టోకెన్ల కోసం వచ్చిన వారికి ఏదో ఒక కారణంతో ఇవ్వకుండా మొండి చేయి చూపిస్తున్నారని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పలుకుబడి ఉన్న కొన్ని వర్గాల ప్రతినిధులకు టోకెన్లు అందుతున్నాయని, సామాన్య ప్రజలకు టోకెన్లు దొరకడం లేదని దుమ్మెత్తి పోశారు. ఈ పరిస్థితిలో ప్రశ్నిస్తున్న ప్రజలను పట్టణ పోలీసులు గేటు బయటి వరకు తీసుకొచ్చి పంపించేశారు.

మైన్స్ ఏడీ ఏమంటున్నారంటే..

ఇసుక టోకెన్ల జారీలో అక్రమాలను జిల్లా మైన్స్ అండ్ జియాలజీ ఏడీ రవి దృష్టికి తీసుకెళ్లగా ఇది తమకు సంబంధం లేని వ్యవహారం అన్నట్లుగా చెప్పుకొచ్చారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చాలి

జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి : పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో భువనేశ్వర్ నుంచి పీఎంఏవై గ్రామీణ్, అర్బన్‌కు సంబంధించి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 విధి విధానాలను భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్చువల్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే గృహాలు మంజూరైన వారందరూ త్వరగా ఇళ్లను పూర్తి చేసుకునేలా గృహ నిర్మాణ శాఖ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య, గృహనిర్మాణశాఖ ఈఈలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక బల్క్ ఆర్డర్లను తహసీల్దార్లు పర్యవేక్షించాలి

జిల్లాలో ఉచిత ఇసుక బల్క్ ఆర్డర్లను తహసీల్దార్లు స్వయంగా పర్యవేక్షణ చేయడంతోపాటు వాటిని ఆడిట్ చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లాలో ఉచిత ఇసుక సరఫరా అంశంలో తీసుకోవాల్సిన చర్యలపై జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇసుకపై ఒక రూపాయి కూడా ప్రజలపై భారం లేకుండా ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందని జేసీ తెలిపారు. కేవలం నిర్వహణ, రవాణా చార్జీలను మాత్రమే వినియోగదారులు చెల్లించాలన్నారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి, ఆర్డీఓ రంగ స్వామి పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన రాజంపేట పాలిటెక్నిక్‌లో నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవితో కలిసి జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. వివరాలకు 9603770097, 8897776368 నంబర్లను సంప్రదించాలన్నారు. ఆర్డీఓ రంగస్వామి, భార్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.




తహసీల్దార్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

వారంలోగా ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల పరిశీలన

జిల్లాలో జరుగుతున్న ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ పరిశీలనను వారంలోగా పూర్తి చేయాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఫ్రీ హోల్డ్ భూముల రీవెరిఫికేషన్ అంశాలపై తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు.

గుట్టుగా గుప్తనిధుల వేట

- కాసుల గుట్టపై తవ్వకాలకు విఫలయత్నం
- బంగారు నాణేలు ఉంటాయనే ఆశతో గుప్త నిధుల ముఠా సంచారం



కాసులకొండ ఇదే.. శ్రీవారిపాదం(ఇన్‌సెట్)



లక్ష్మీనృసింహస్వామి మూర్తులు

రాజంపేట : కాసుల గుట్టపై గుప్త నిధుల ముఠా కన్ను పడింది. ఇప్పటికే అనేకమార్లు గుప్తనిధుల ముఠాలు విఫలయత్నం చేశారు. పూర్వం ఈ ప్రాంతంలో ఎక్కడాలేని విధంగా ఉన్న కొండ వద్ద బంగారు, వెండి కాసులు లభ్యమయ్యేవని పూర్వీకులు చెబుతున్నారు. ఆ నాటి నుంచి నేటి వరకు కాసుల గుట్టగా ప్రాచుర్యంలో కొనసాగుతోంది. అందువల్ల కాసుల కొండపై గుప్తనిధుల ముఠా కన్నుపడింది. చాలా కాలం నుంచి కాసుల కొండ ప్రాంతంలో గుప్తనిధుల ముఠా తవ్వకాలు చేపడుతోంది. స్థానికంగా కొందరు గుప్తనిధుల ముఠా సభ్యుల హస్తం కూడా ఈ తవ్వకాలలో ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రధానంగా బంగారు కాసులు ఉంటాయని, పైగా శ్రీవారిపాదం ఆకృతి ఉండటంతో బంగారు నాణేలు ఉన్నాయని కొండలో అక్కడక్కడా గుప్తనిధుల ముఠా తవ్వకం చేపట్టింది. బంగారు కాసుల కోసం ఈ ముఠా నేటికీ విఫలయత్నం చేస్తూనే ఉంది.

ఎక్కడుంది..

నందలూరు మండల ఎర్రిపాపయ్యగారిపల్లె గ్రామానికి ఉత్తరం వైపు ఒకప్పుడు అటవీ ప్రాంతంగా ఉండే ప్రదేశంలో కాసులకొండగా ఈ ప్రాంతవాసులు పిలుచుకుంటున్నారు. అంటే పూర్వం ఈ కొండ వద్ద కాసులు లభించేవని, అందువల్లనే కాసులగుట్ట, కాసుల కొండగా పిలుచుకుంటున్నారని ప్రతీతి. ఆ విధంగా కాసులకొండ ప్రసిద్ధికెక్కింది. ఈ కొండను చూస్తే ఆధ్యాత్మిక భావనలు కలుగుతాయి.

కొండదిగువనా..

కొండ దిగువన పురాతన శ్రీ లక్ష్మీనృసింహస్వామి గుడి ఉంది. కాసులకొండ వద్దకు అటుగా ఎవ్వరు పెద్దగా వెళ్లేవారు కాదు. కొండ దిగువన వెలసి ఉన్న నృసింహస్వామి ఉత్సవాలను ఏడాది కొకసారి చేసుకుంటూ వచ్చేవారు. అయితే ఈ గుడి ఏ కాలం నుంచి ఉందో తెలియడంలేదు. ఎక్కడా లేని విధంగా రాతిదీపస్తంభతోపాటు, పురాతన కాలంనాటి ఆలయంలా కనిపిస్తుంది. కాలక్రమేణా గుడి శిథిలావస్థకు చేరుకుంది.

కొండపై శ్రీవారిపాదం ఆకృతి

కాసులకొండకు ముందు భాగంలో, పురాతన గుడికి వెనుక భాగంలో శ్రీవారిపాదం ఆకృతి కలిగి ఉంది. దీంతో శ్రీవారు తిరుమల కొండ పయనంలో ఈ ప్రాంతంలోని ఈ నల్లరాయికొండపై కాలుమోపినట్లుగా ఇక్కడి భక్తుల విశ్వాసం. అందుకే ఈ పాదాకృతికి భక్తులు పూజలు చేస్తున్నారు. ఈ ఆకృతి పూర్వం నుంచి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. దీపం పెట్టుకొని శ్రీవారిపాదాలకు నమస్కరించుకుంటున్నారు.

గుడి నిర్మాణానికి నడుం బిగించిన భక్తులు

కాసుల కొండ దిగువన పురాతన కాలం నుంచి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి గుడి పునర్ నిర్మాణానికి భక్తులు నడుం బిగించారు. స్థానికులు, భక్తులు సంయుక్తంగా విరాళాల సేకరణ ద్వారా నందలూరు ప్రాంతంలో ఎక్కడాలేని విధంగా శ్రీ లక్ష్మీనృసింహస్వామి గుడిని పూర్తిగా రాతికట్టడంతో నిర్మిస్తున్నారు. గుడి పూర్తి అయితే ఆధ్యాత్మిక క్షేత్రంగా నృసింహుని క్షేత్రం విరాజిల్లనుంది.

గ్రీన్‌ఫీల్డ్ హైవేతో..

గుడికి సమీపంలో కడప–రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్‌ఎక్స్‌ప్రెస్ హైవే నూతనంగా నిర్మాణం చేపట్టనున్నారు. ఈ హైవే సమీపంలో పురాతన నృసింహస్వామి ఆలయం జీర్ణోద్ధరణతో ఈ ప్రాంతం పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేసి వ్యాపారం చేస్తున్నారు.

నృసింహుని ఆలయం నిర్మాణానికి దాతల సహకారం



కాసులగుట్ట వద్ద చరిత్ర కలిగిన కాసులకొండ నృసింహుని ఆలయం నిర్మాణాన్ని దాతల సహకారంతో చేపడుతున్నారు. కాని పూర్తిగా ఆలయం నమునా నిర్మాణానికి అధిక వ్యయం అవుతోంది. స్వామి భక్తులు మరికొంతమంది ముందుకొస్తే నిర్మాణం పూర్తవుతుంది. కాసులకొండ భవిష్యత్తులో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుంది.

– మల్లికార్జునరెడ్డి, భక్తుడు, వైపీపల్లె, నందలూరు

అత్యంత మహిమగల కాసులగుట్ట లక్ష్మీనృసింహస్వామి



కాసుల గుట్ట లక్ష్మీ నృసింహస్వామి అత్యంత మహిమగల స్వామి. నందలూరు ప్రాంతంలో ఎక్కడ కూడా లక్ష్మీనరసింహస్వామి ఆలయం లేదు. అందులో ఈ ఆలయం ప్రాచీనమైనది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పురాతనకాలం నుంచి కొలవబడుతున్నారు. ఆలయ జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ ఆలయం పూర్తయితే నూతనంగా చేపట్టబోయే గ్రీన్‌ఫీల్డ్‌ఎక్స్‌ప్రెస్ హైవే మార్గం ఆధ్యాత్మిక క్షేత్రం కాగలదు.

– గిరిస్వామి, నందలూరు

క్లుప్తంగా

'ఆ టీచర్ మాకొద్దు'



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు

వీరబల్లి : మండలంలోని ఒంగిమల్ల ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు టీచర్ తమకు వద్దంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. టీచర్ చెప్పే పాఠాలు అర్థం కావడం లేదని వారు వాపోతున్నారు. ఈ విషయంపై పదో తరగతి విద్యార్థులను అడుగగా.. తెలుగు టీచర్ సక్రమంగా అర్థమయ్యేటట్లు పాఠాలు చెప్పడం లేదని, చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అర్థం కాని పాఠాలపై సందేహాలు అడిగితే విసుక్కోవడమే కాకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నారని, క్లాస్ రూమ్‌కు వచ్చి మౌనంగా కూర్చొని ఉంటున్నారన్నారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌ను వివరణ అడుగగా.. ఈ టీచర్‌కు తాను ఎంత చెప్పినా మార్పు రాలేదని తెలిపారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

గాలివీడు : విద్యార్థిని విచక్షణా రహితంగా కొట్టిన ఉపాధ్యాయుడిపై విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు గాయపడిన విద్యార్థి తండ్రి లియాఖాత్ అలీఖాన్‌ను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థిపై అమానుషంగా దాడి చేసి గాయపరచిన ఉపాధ్యాయుడు రవిని తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి తండ్రి లియాఖాత్ అలీఖాన్ మాట్లాడుతూ ఇటీవలే కోవిడ్ బారిన పడి ఆరోగ్య సమస్యలతో బయటపడిన తన కుమారుడిపై అత్యంత కర్కశంగా దాడి చేసిన సదరు ఉపాధ్యాయుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై మండల విద్యాశాఖ అధికారి పిల్లి నాగరాజు విద్యార్థి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను విచారణ చేసి నివేదికలు తయారు చేసి జిల్లా అధికారులకు పంపినట్లు తెలిపారు.

సస్పెండ్ చేయాలి : విద్యార్థిపై దాడి చేసిన ఆంగ్ల ఉపాధ్యాయుడు రవి కుమార్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గాయపడిన విద్యార్థిని వారు పరామర్శించి, కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారులను కలిసి నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విజేతలతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

నందలూరు : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలకు నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అహ్మద్ ఎంపికయ్యాడు. ఇటీవల కడప బాలికల జూనియర్ కాలేజీలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అహ్మద్ అత్యంత ప్రతిభ కనబరిచి ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. అతనితోపాటు పాఠశాలలోని ముబారక్ అనే విద్యార్థి స్టాండ్ బైగా ఎంపిక అయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణయ్య, అసిస్టెంట్ హెడ్ మాస్టర్ షేక్ రాఫ్‌బాషా మంగళవారం అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నందలూరు : మండలంలోని పాటూరు గ్రామ పంచాయతీ బీసీ కాలనీలో ఓ ఇంటిలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో ఇల్లు దగ్ధమైంది. దీంతో బైక్, టీవీ, కూలర్, ఫ్యాన్లు తదితర విలువైన వస్తువులు కాలిపోయాయని బాధితుడు పప్పులేటి శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు పేర్కొన్నాడు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

మంత్రి వ్యాఖ్యలు అర్థరహితం



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మంత్రి సత్యకుమార్ చేసిన విమర్శలు అర్థరహితం. కేవలం కూటమి ప్రభుత్వం తరఫున మాట్లాడటం కాదు. పులివెందుల మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని గుర్తుపెట్టుకోవాలి. ఇందులో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలి కానీ.. అనవసర వ్యాఖ్యలు సరికాదు. ఎంతసేపూ వైఎస్ఆర్‌సీపీపై పడి ఏడిస్తే ఏం లాభం. కాలయాపన మాటలను ప్రజలు నమ్మరు.

–ఇలియాస్, గల్ఫ్ వైఎస్సార్‌సీపీ కన్వీనరు, కడప



జగన్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసు



వైఎస్ జగన్‌కు ప్రజల్లో మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను రద్దు చేస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్రానికి తొలిసారిగా ఒకేసారి 17 మెడికల్ కళాశాలలు రావడం గొప్ప విషయం. వైద్య కళాశాలలు లేక వేరే ప్రాంతాలకు మన పిల్లలు వెళ్తున్నారు. ఫిలిప్పీన్స్ వెళ్లిన ముగ్గురు విద్యార్థులు చనిపోయిన విషయం అందరికీ తెలిసిందే. తక్కువ ఖర్చుతో చదవ వచ్చని అక్కడికి వెళ్తున్నారు. ఇక్కడే తక్కువ ఖర్చుతో చదివే అవకాశం లభిస్తే.. అంత దూరం వెళ్లాల్సిన అవసరం లేదు కదా?

– సుధామాదురి, ఎంపీపీ, చిన్నమండెం

హార్సిలీహిల్స్‌పై గ్రామసింహాల స్వైర విహారం

- మృతి చెందిన దుప్పి
- వన్యప్రాణులకు ముప్పు
- పర్యాటకులకు ఇక్కట్లు



హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

బి.కొత్తకోట : చల్లటి వాతావరణం, స్వచ్ఛమైన గాలికి నిలయమైన బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తున్నాయి. సముద్ర మట్టానికి 4,141 అడుగుల ఎత్తులోని కొండపై పదేళ్ల క్రితం వరకు దోమలు, కుక్కలు కనిపించేవి కావు. పెరిగిపోతున్న కాలుష్యం, ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాల పారబోత కారణంగా.. వాటి కోసం కుక్కలు కొండ పైకి రావడం మొదలైంది. రోడ్లపై ఇవి సంచరిస్తూ పర్యాటకులను ఇబ్బందులకు గురిచేయడమే కాక అడవిలోని వన్యప్రాణులపైనా దాడులకు పాల్పడి ప్రాణాలు తీస్తున్నాయి. వ్యర్థాలను తరలించి నిల్వ చేసేందుకు కొండ కింద డంపింగ్ యార్డును గతంలో అధికారులు ప్రతిపాదించినప్పటికీ కార్యరూపం దాల్చకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని కొండ కింద నుంచి కుక్కలు కొండపైకి చేరుకుని ఇక్కడే ఉండిపోయాయి. నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే సందర్శకులు, ప్రముఖులకు అసహనం కలిగిస్తున్నాయి. గాలిబండ, వ్యూపాయింట్ల వద్ద సందర్శకులు వెంట తెచ్చుకుని తినే ఆహారం కోసం వారి వద్ద ఎగబడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అటవీప్రాంగణం, రెవెన్యూ అతిథిగృహం, జిడ్డు సర్కిల్ ప్రాంతాల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. బైక్‌లపై వెళ్లే వారి వెంటపడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా అడవిలోని వన్యప్రాణులకు ప్రమాదం పొంచి ఉంది. శనివారం దుప్పిని వెంటాడి దాడిచేసి కొరికి చంపాయి. ఇదే కాక మరికొన్ని వన్యప్రాణులు వీటి బారిన పడి మృత్యువాత పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. ఘాట్‌రోడ్డులో యథేచ్ఛగా సంచరిస్తూ రోడ్డును దాటుతున్న వన్యప్రాణాలపై దాడి చేస్తున్నాయి. గంగోత్రి వద్ద, రోడ్డు పక్కన నీటితొట్టెలున్న చోట నీళ్ల తాగేందుకు వచ్చే వన్యప్రాణులపై దాడి చేస్తున్నాయి. దీని కారణంగానే నిత్యం ఘాట్‌రోడ్డుపై కనిపించే జింకలు, కుందేళ్లు, దుప్పులు, కణితలు తదితర వన్యప్రాణులు కనిపించడం లేదని సందర్శకులు చెబుతున్నారు. కాగా శనివారం మృతి చెందిన దుప్పి గురించి సోమవారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి డీఆర్‌ఓ మదన్‌మోహన్ స్పందించారు. మృతి చెందిన దుప్పిని సిబ్బంది పరిశీలించారు. కళేబరాన్ని అడవిలోనే పూడ్చి పెట్టారు. హార్సిలీహిల్స్‌పైన, ఘాట్‌రోడ్డుపై కుక్కల బెడద లేకుండా చేసేందుకు అటవీ, రెవెన్యూ అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

స్విట్జర్లాండ్ సంస్థలతో 'అన్నమాచార్య' ఒప్పందం



స్విట్జర్లాండ్ దేశ యూనివర్సిటీ ప్రతినిధులతో అన్నమాచార్య ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి

రాజంపేట : స్విట్జర్లాండ్ దేశానికి చెందిన రెండు సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో-చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి తెలిపారు. స్థానికంగా ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. తాము స్విట్జర్లాండ్ దేశంలో ప్రముఖ జ్యూరిచ్ యూనివర్సిటీతోపాటు మరో సంస్థతో ఎంవోయూ చేసుకున్నామని వెల్లడించారు. క్యూఎస్‌లో ప్రతిష్ఠాత్మక రంగంలో 90వ స్థానంలో జ్యూరిజ్ యూనివర్సిటీ ఉందన్నారు. సాంకేతిక ప్రగతికి బలమైన భాగస్వామిగా నిలుస్తోందన్నారు. ఈ ఒప్పంద వల్ల ఇరు యూనివర్సిటీల మధ్య విద్యార్థులకు మార్పిడి సదుపాయం కలుగుతుందన్నారు. వారికి విభిన్న, సాంస్కృతిక, విద్యా అనుభవాలను అందిస్తుందన్నారు. పరిశోధనల మార్పిడి ద్వారా ఇరు విద్యాసంస్థల ప్రగతికి తోడ్పాటు అవుతుందన్నారు. మౌలిక పరిశోధనలు జరుగవచ్చునన్నారు. అధ్యాపకుల మార్పిడి కూడా ఈ ఒప్పందంలో ఒక ముఖ్యాంశమన్నారు. నూతన ప్రాజెక్టులకు కలిసి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా అన్నమాచార్య యూనివర్సిటీ అంతర్జాతీయ గుర్తింపు పొందే అవకాశం ఉంటుందన్నారు. స్విట్జర్లాండ్ యూనివర్సిటీ ఒప్పందంపై ఏయూ చాన్స్‌లర్ చొప్పాగంగిరెడ్డి, ఏఐటీఎస్ అధినేత చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ హర్షం వ్యక్తంచేశారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామానికి చెందిన రైతు సోమిరెడ్డి (58) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమిరెడ్డి వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. గ్రామంలోని తన తోట వద్దకు రోజు మాదిరిగానే మంగళవారం వెళ్లాడు. మోటార్ స్టార్టర్ ఆన్ చేసి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలి చనిపోయాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

దళితుల ఇళ్ల స్థలాలు ఆక్రమణకు యత్నం

జేసీకి బాధితుల ఫిర్యాదు



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, బాధితులు

రాయచోటి : ప్రభుత్వం అందించిన ఇంటి నివేశిత పట్టా భూములను అగ్రవర్ణాలకు చెందిన కొంత మంది ఆక్రమణకు యత్నిస్తున్నారంటూ దళితులు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాజంపేట మండలం కొల్లవారిపల్లి పంచాయతీ అరుంధతివాడకు చెందిన 50 కుటుంబాల వారు మంగళవారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో కొన్ని తరాలుగా తమ పూర్వీకులతోపాటు తాము నివాసం ఉంటున్నామని వారు తెలిపారు. ప్రతి కుటుంబంలో జన సంఖ్య పెరగడంతో గత ప్రభుత్వంలో గ్రామ పరిధిలోని సర్వే నంబరు 386లో ఇంటి పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. ఆ మేరకు ఇంటి స్థలాలను కూడా గత ప్రభుత్వంలోనే కేటాయించి ప్రభుత్వ భూమి అని అధికారులు బోర్డులు కూడా పెట్టారని తెలిపారు. అయితే ప్రస్తుతం అదే భూమిలో తమకు పట్టా ఉందని కంచి వేయగా ఇదేమని ప్రశ్నిస్తే.. అగ్రవర్ణాల వారు తమపై దాడులకు తెగబడుతున్నారని వాపోయారు. కావున జిల్లా కలెక్టర్ స్పందించి పట్టాలు ఇచ్చిన స్థలంలో గృహాలు నిర్మించుకునేలా సహకరించాలని విన్నవించారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పేర్కొన్నారు.

పోలీస్ బందోబస్తు నడుమ రహదారి పనులు



రోడ్డు పనులకు బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం కడప రోడ్డు మార్గంలో పోలీస్, రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు మంగళవారం పోలీస్ బందోబస్తు నడుమ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. బళ్ళారి – నాయుడుపేట జాతీయ రహదారి-71 నాలుగు లేన్ల విస్తరణలో భాగంగా ఈ పనులు చేపడుతున్నారు. బోడుమల్లువారిపల్లెకు చెందిన బి.సి.అమరనాథరెడ్డి సర్వే నంబరు 260/1లో 18 సెంట్లు, బి.సి.పురుషోత్తంరెడ్డి సర్వే నంబరు 150/7లో 1.39 ఎకరాల భూమిని జాతీయ రహదారికి కోల్పోవడం జరిగింది. అప్పట్లో రెవెన్యూ అధికారులు వ్యవసాయ భూములుగా గుర్తించి నివేదిక ఇచ్చారు. అయితే బాధితులు తమ భూములు వ్యవసాయేతర భూములుగా మార్చడం జరిగిందని, తక్కువ పరిహారం మంజూరైందన్నారు. పనులు అడ్డుకుని తాము కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారుల అథారిటీ అధికారుల అభ్యర్థన మేరకు జేసీ ఆదేశాల మేరకు పోలీస్ బందోబస్తు చేపట్టారు. పనులు అడ్డుకోబోయిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

'ముదివేడు' నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి



జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నిర్వాసితులు

రాయచోటి అర్బన్ : ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు 2023 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదివేడు రిజర్వాయరు నిర్మాణం కోసం పాలకులు అనేక అవకతవకలకు పాల్పడి రైతులను నట్టేట ముంచారన్నారు. సీపీఎం పోరాటం ఫలితంగా ముంపునకు గురయ్యే భూములు, ఇళ్లు గుర్తించి గ్రామసభ నిర్వహించి అవార్డు ప్రకటించిందన్నారు. కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లోని 700 మంది రైతుల భూములతోపాటు 5 గ్రామాలు నీటమునుగుతాయన్నారు. సదరు భూములలోని మట్టిని తవ్వేసి రిజర్వాయరు అవసరాల కోసం వినియోగించినందున వ్యవసాయం చేసేందుకు పనికి రావంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి 5 సెంట్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.25 లక్షలు చెల్లించాలన్నారు. డీకేటీ భూములకు పరిహారంతో పాటు భూమిలేని కూలీలకు రూ.5 లక్షల చొప్పున పరిహారంగా అందివ్వాలన్నారు. నిర్వాసితులకు వెంటనే న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు, నిర్వాసితుల సంఘం నేతలు శ్రీనివాసులు, కిరణ్, సురేంద్రరెడ్డి, రమణ, ఆంజనేయులు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ బస్సు సర్వీసు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



గుర్రంకొండ బస్టాండ్‌కు చేరుకున్న స్టూడెంట్ స్పెషల్ బస్సు

గుర్రంకొండ : ఎట్టకేలకు ఆర్టీసీ అధికారులు గుర్రంకొండ–మదనపల్లె మార్గంలో స్టూడెంట్ స్పెషల్ బస్సు సర్వీసును ప్రారంభించారు. ఇటీవల 'బస్సుల కోసం విద్యార్థుల కష్టాలు' అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. ఉదయం 7.30 గంటలకు స్టూడెంట్ బస్సు గుర్రంకొండ నుంచి బయలుదేరి మదనపల్లెకు చేరుకుంటుంది. మళ్లీ సాయంత్రం 4 గంటలకు మదనపల్లెలో బయలుదేరి గుర్రంకొండకు వచ్చే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మదనపల్లె డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కొంత కాలంగా డిపోలో బస్సుల కొరత ఉండేదన్నారు. ప్రస్తుతం బస్సుల కొరత తీరిందని, ఇక మీదట రెగ్యులర్‌గా స్టూడెంట్ బస్సు సర్వీసు నడుపుతామన్నారు. దీంతో విద్యార్థుల సమస్య తీరడంతో వారి తల్లిదండ్రులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

బీసీలకు న్యాయం చేయని టీడీపీ

- కులగణన చేయకుండా బీసీ డిక్లరేషన్ ఎలా సాధ్యం?
- స్థానిక సంస్థల్లోపు చేయకపోతే కూటమికి వ్యతిరేకంగా ఓటు
- బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ డాక్టర్.పూర్ణచంద్రరావు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ కో ఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ పూర్ణచంద్రరావు

మదనపల్లె : పెరియార్ ఐడీయాలజీ అంటూ 40 ఏళ్ల క్రితం పుట్టుకువచ్చిన టీడీపీ బీసీలకు ఎటువంటి న్యాయం చేయకుండా, కేవలం ఒక కులపార్టీగా నిలిచిపోయిందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు అన్నారు. పెరియార్ జయంతి సందర్భంగా బీఎస్పీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ అధ్యక్షతన బీసీ కుల జనగణన అంశంపై మదనపల్లెలో మంగళవారం బీసీ అసెంబ్లీ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2,902 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికైతే... వారిలో ఎక్కువ శాతం రెడ్లు, కమ్మ కులాలకు చెందిన వారేనన్నారు. జనాభా దామాషా ప్రకారం 50 శాతానికి పైగా ఉన్న బీసీ కులాలకు ప్రస్తుత రాజకీయపార్టీలు ఇచ్చిన టికెట్లు వేళ్లపై లెక్కపెట్టవచ్చన్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే కులగణనతోనే సాధ్యమన్నారు. ఇటీవల ఎన్నికల సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోలో బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తూ.. చట్టసభల్లో 33 శాతం, స్థానికసంస్థల్లో 34 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కులగణన నిర్వహించకుండానే బీసీలకు రిజర్వేషన్ ఏ విధంగా అమలు చేస్తారో చంద్రబాబే చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక రంగాల మీద శ్వేతపత్రాలు విడుదల చేస్తున్న చంద్రబాబు, గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి చేయించిన కులగణనను బయటపెట్టి, మరింత పటిష్ఠంగా కులగణనను నిర్వహించవచ్చన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోపు కులగణన నిర్వహించకుంటే, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలన్నారు. తమిళనాడులో పెరియార్ స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలన్నీ రాజకీయ ప్రాధాన్యతతో పాటు స్వేచ్ఛను అనుభవిస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రజాపాలన కావాలంటే, అణగారిన వర్గాలకు మేలు జరగాలంటే పెరియార్ ఐడియాలజీని అమలు చేస్తూ, బీసీలకు రాజ్యాధికారం దిశగా అడుగులు పడాలన్నారు. బీఎస్పీకి ఓటు వేయాలన్నారు. సమావేశానికి ముందు పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మార్కెట్‌యార్డు ఎదుట పూలే విగ్రహానికి నివాళులర్పించి, అక్కడి నుంచి జేసీఎం కమ్యూనిటీ హాల్ బీసీ అసెంబ్లీ వేదిక వరకు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి వందనకుమార్, జోన్ కోఆర్డినేటర్ మల్లికల్, రిటైర్డ్ ఎంఈఓ పోతబోలురెడ్డెప్ప, బీసీ చైతన్యసమితి అధికార ప్రతినిధి సహజీవన్‌బాబు, వాల్మీకిసంఘం పులి శ్రీనివాసులు, గాండ్ల సంఘం జిల్లా అధ్యక్షులు బండపల్లె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన ఏఆర్ కానిస్టేబుల్ మృతి



కృష్ణయ్య (ఫైల్)

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు పంచాయతీ పరిధి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆగస్టు 31న ద్విచక్రవాహనం అదుపుతప్పి ఏఆర్ కానిస్టేబుల్ కృష్ణయ్య(54)కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్వగ్రామమైన కొత్తపల్లిలో అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతుందని బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ..



ఎస్.పి.నాగన్న (ఫైల్)

కలకడ : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నగిరిమడుగు పెద్ద నాగన్న మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. సంబేపల్లె మండలం ఎస్.సోమవరం పంచాయతీ అగ్రహారానికి చెందిన ఎస్.పి.నాగన్న ఈ నెల 11న కలకడ సత్యవతి బ్రిడ్జిపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆయనను తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రి చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

వినాయక నిమజ్జనానికి వెళ్తుండగా..

- యువకులపైకి దూసుకొచ్చిన సుమో • ముగ్గురికి గాయాలు



గాయపడిన శ్రీకాంత్

వాల్మీకిపురం : సుమో ఢీకొని ముగ్గురు యువకులకు గాయాలైన సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కొత్తపేటవీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం ఊరేగింపు పూర్తి చేసుకొని నిమజ్జనానికి వెళ్తున్నారు. బైపాస్ రోడ్డులో ఎదురుగా వచ్చిన ఓ సుమో.. విగ్రహం ముందు వెళ్తున్న డప్పు వాయిద్యకారులు, యువకులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డప్పు వాయిద్యకారుడు శ్రీకాంత్, మరో ఇద్దరు యువకులు కుషల్, గురులకు గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లికి రెఫర్ చేశారు. ఈ మేరకు ఎస్సై శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సును ఢీకొన్న లారీ

రామాపురం : మండల పరిధి మేదరపల్లె చెక్‌పోస్టు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వేలూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును కడప నుంచి రాయచోటి వైపు వస్తున్న సిమెంటు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. బాధితులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటికి, కడప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి డబ్బులివ్వలేదని..

భార్యపై భర్త హత్యాయత్నం

మదనపల్లె : మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వకపోవడంతో భర్త.. భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం జరిగింది. మండలంలోని బసినికొండ పంచాయతీ మారెమ్మవీధిలో నివాసం ఉంటున్న ఉదయ్‌కుమార్, పల్లవి పదేళ్ల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఉదయ్‌కుమార్ ఆటోడ్రైవర్‌గా, పల్లవి ఇంటివద్దే టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి కుమారుడు రుద్ర(6), కుమార్తె జాహ్నవి(5) ఉన్నారు. ఉదయ్‌కుమార్ కొంత కాలంగా ఆటోకు వెళ్లకుండా, ఎలాంటి పని చేయకుండా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. టైలరింగ్ వృత్తి ద్వారా భార్య పల్లవి సంపాదించిన డబ్బులను.. మద్యం తాగేందుకు ఆమెను కొట్టి తీసుకెళ్లేవాడు. మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఎప్పటిలాగానే మద్యం తాగేందుకు డబ్బులు కావాలని అడిగాడు.

దీనికి ఆమె అంగీకరించకపోవడంతో ఉదయ్‌కుమార్ ఆగ్రహంతో టైలరింగ్ మెషిన్ మీద ఉన్న కత్తెరను తీసుకుని, భార్యపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. పల్లవి కుడిభుజం, తల మీద రెండుచోట్ల గాయాలై తీవ్ర రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు స్వగ్రామానికి గల్ఫ్ బాధితురాలు

జిల్లా ఎస్పీ సహకారంతో..



ఎస్పీ వద్దకు వచ్చిన షహీనా, ఆమె కుటుంబ సభ్యులు

రాయచోటి : అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు జోక్యంతో.. గల్ఫ్‌లో అష్టకష్టాలు పడుతున్న బాధితురాలు స్వగ్రామానికి చేరుకుంది. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం పెద్దూరు గ్రామానికి చెందిన షహీన (30) తన కుటుంబాన్ని పోషించేందుకు ఈ ఏడాది ఆగస్టు 25న గల్ఫ్‌లోని ఒమెన్ దేశానికి వెళ్లింది. ఏజెంట్ మోసపూరిత వీసా తీయడంతో.. ఒమెన్ దేశంలో ఆమె తీవ్ర ఇబ్బందులకు గురైంది. షేట్ తనను కొట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నాడని కన్నీటి పర్యంతమై వీడియో ద్వారా బోరున విలపించింది. ఆమె ఇద్దరు పిల్లలు ఈ నెల 10వ తేదీన జిల్లా ఎస్పీని కలిసి తల్లి పడుతున్న బాధను విన్నవించారు. తీవ్ర కష్టాలలో ఉన్న తమ తల్లిని రక్షించి, ఇంటికి తీసుకురావాలని వేడుకున్నారు. దీంతో ఎస్పీ స్పందించి ఏజెంట్‌ను పిలిపించి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. షహీనాను ఏజెంట్ ద్వారా ఇండియాకు రప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఎస్పీ ప్రయత్నాలు ఫలించడంతో సెప్టెంబర్ 11న ఒమెన్ నుంచి బయలుదేరి 12న సురక్షితంగా స్వదేశానికి చేరుకుంది. దీంతో ఆమెతో పాటు కుటుంబ సభ్యులు మంగళవారం ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.